# భయం

వంటయింటి గుమ్మంలో నిలబడి చొక్కా చివరతో ముక్కు తుడుచుకుంటూ, ఒక చేత్తో జారిపోతూన్న లాగూను పైకి లాక్కుంటూ, "పిన్నీ! నువ్విచ్చిన లెక్కలన్నీ చేసేశాను. ఇంక ఆడుకోమంటావా?" అని అడిగాడు చిరంజీవి. కుంపటిమీద కాఫీకి నీళ్ళుపడేసి జానకి అతని వంక చూస్తూ, కోపంగా "చొక్కాతో ముక్కు తుడుచుకోవద్దని నీ కెన్నిసార్లు చెప్పాను? మళ్ళీ ఎప్పుడన్నా చూశానంటే వీపు చీరేస్తాను. గుర్తుపెట్టుకో. ఇచ్చిన కూడికలూ తీసివేతలూ చేశావా? కాస్సేపు వుండి చూస్తాను. ఈ లోపుగా మన వరండాలో ఆడుకో. దుమ్ములో తిరిగినట్టు తెలిసిందా, నీ కివాళ మూడిందన్నమాటే" అన్నది.

చిరంజీవి పిన్ని అనుమతిపొంది త్వరత్వరగా ముందు హాల్లోకి పోయి బీరువా వెనకవున్న రబ్బరు బంతిని తీసుకుని వేపచెట్టు నీడలో నడిచి సరిహద్దు గోడపక్కగా వెళ్ళి– "సేతూ! మాపిన్ని ఆడుకోమన్నది. రా!" అని పిలిచాడు. సేతు వాళ్ళ ఇంటి వరండాలో కుర్చీలో కూర్చుని ఏమీ తోచక కూనిరాగాలు తీస్తున్నాడు. చిరంజీవి పిలుపువిని సేతు గోడ గెంతి పరుగెత్తుకొని వచ్చాడు. వాడికెప్పుడూ తీరికే. వాళ్ళయింట్లో వాణ్ణి 'చదువుకో, లెక్కలు చెయ్యి, ఎక్కాలు వల్లెవెయ్యి' అని సాధించేందుకు ఎవరూలేరు. వాళ్ల అమ్మ వాడి చిన్నతనంలోనే పోయింది. వాళ్ళ నాన్న తాసిల్దారు ఆయన మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. సేతు ఈ వేసవికాలం సెలవుల్లో ఏమీతోచక బాధపడతాడు. వాళ్ళ ఇంట్లో రేడియోవుంది. ఎన్నో బొమ్మల పుస్తకాలున్నాయి. ఆడుకునేందుకు కావలసిన సామాన్లు కొయ్యగుర్రం, 'కీ' ఇస్తే పరుగెత్తే రైలుబండి మొదలైనవెన్నో వున్నాయి. సేతుకు రేడియోవినటం ఇష్టంలేదు. దాన్ని వాళ్ళ అక్కయ్యకు వొదిలేస్తాడు. బొమ్మలతో ఆడుకోవటమన్నా వాడికి చిరాకే. 'అరేఖ్ళ

వెళ్ళి ఇంత పెద్దవాణ్ణయిన తర్వాత వెధవ బొమ్మలాటేమిటి?' అని వాడు విసుక్కుంటూ వుంటాడు. అందువల్ల 'ఒక్కగానొక్క కొడుకే' అని గారాబంతో వాళ్ళ నాన్నగారు కొనుక్కువచ్చే బొమ్మలన్నీ అతని చెల్లెలు మంగకిచ్చేవాడు. వాడికి కాలక్షేపం చేసేందుకు తనంత పెద్దవాడొకడు తోడుకావాలి. చిరంజీవి అన్ని విధాలా తగునుకాని, వాడికి ఇంట్లో బోలెడన్ని బరువులూ, బాధ్యతలూ. వాడి పిన్ని వాడిపట్ల చాలా నిరంకుశంగా ప్రవర్తిస్తూవుంటుంది. ఆమె వాణ్ణి ఎండలో దుమ్ములో కాలు పెట్టనివ్వదు. ఆమె ఇచ్చిన లెక్కలన్నీ వాడు చెయ్యాలి. అంతా అయిన తర్వాత ఎప్పుడో ఒక్క గంటసేపు ఆడుకోనిస్తుంది. రోజుకిన్ని గంట లుండగా అంతా వ్యర్థంగా, లెక్కలుచేస్తూ, ఎక్కాలు వల్లిస్తూ ఇంకా ఏవేవో పాఠాలు చదువుతూ గడిపి ఒక్క గంటమాత్రమే ఆడుకోవా లనటం ఏమీ మంచివిషయం కాదు. ఇన్ని బాధ్యతలూ నిర్వహించుకుని గాని చిరంజీవి బంతి పుచ్చుకుని గోడ దగ్గరికివొచ్చి పిలవడు. ఏమీ తోచక బాధపడే సేతుకు ఆ పిలుపు వినిపించిందంటే మహదానందం కలుగుతుంది.

సేతు గోడదూకి రాగానే ఇద్దరూ కలిసి విశాలంగావున్న ఆ వరండాలో 'ఫుట్ బాల్' ఆడుకోవటం ప్రారంభించారు. అది ఒక పెద్ద రబ్బరుబంతి. ఆట మొదలుపెట్టేముందు చిరంజీవి సేతుతో "ఒరేయ్! పెద్దగా అరవకు. మా పిన్ని వూరుకోదు, నీకు తెలుసుగా. మునుపు మా నాన్నగారితో చెప్పి ఎట్లా కొట్టించిందో" అన్నాడు.

సేతుకు ఆ విషయం బాగా తెలుసు. అది గుర్తుకు వొచ్చినప్పు డల్లా అతని వొళ్ళు జలదరిస్తూవుంటుంది. పది, పదిహేను రోజులక్రితం ఒకనాడు వాళ్ళిద్దరూ యిలాగే ఆడుకుంటూవుండగా, ఆ బంతి తగిలి వరండాలో గోడకు తగిలించివున్న ఒక ఫొటో కిందపడి, దాని అద్దం పగిలిపోయింది. ఆ ఫొటో చిరంజీవి తల్లిది. అతని తండ్రికీ పిన్నికి యిద్దరికీ ఆ ఫొటో అంటే గౌరవం. పిన్ని ప్రతి శుక్రవారమూ దొడ్లో పూచిన మల్లెపూలతో దండగుచ్చి ఆ ఫొటోకు వేస్తుంది. నాన్న సంగతి సరేసరి. పిన్ని అంటే ఆయన కెంత అనురాగమో ఆ ఫొటో అన్నా

అంతే అనురాగం. ఈ విధంగా బంతి తగిలి ఫొటో క్రిందపడి పగిలి పోయిన సంగతి పిన్ని నాన్నతో ఆఫీసునుంచి రాగానే చెప్పింది. ఆయన రుద్రుడైనాడు. సేతు అంచనాప్రకారం ఆనాడు చిరంజీవి తిన్నన్ని దెబ్బలు యీ భూమిమీద ఎవరూ తినివుండరేమో! చివరకు వాళ్ళ పిన్ని అడ్డంపోయి చిరంజీవిని చేతుల్లోకి తీసుకుని, "బాగానేవుంది. ఏదో పొర పాటున బంతి తగిలి ఫొటో పగిలిపోయినంత మాత్రాన కుర్రవాణ్ణి యింతగా బాదుకుంటారా? ఆ ఫొటోకు మళ్ళీ అద్దం వేయించుకువొస్తే సరి" అని భర్తను మందలించి, చిరంజీవిని సముదాయించింది. చిరంజీవి అప్పుడు వెక్కి వెక్కి ఏడుస్తూనే పిన్ని భుజంమీద తలపెట్టుకుని పడు కున్నాడు. ఇదంతా సేతు చాటుగావుండి చూశాడుకూడా.

గోడగడియారం మూడుగంటలు కొట్టింది. సేతూ చిరంజీవి ఇంకా ఆడుకుంటూనే వున్నారు. బయట ఎండ మండిపోతోంది. నిప్పుల మీదినుంచి వస్తున్నట్టు గాలి వేడిగా వీస్తోంది. రెండు పిచికలు పంచలో నేలమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాయి. వేపచెట్టుమీద వేంచేసి వున్న కాకి వొకటి 'కాకా' అని కూసింది.

ఇంతలో ఒక ప్రమాదం జరిగిపోయింది. చిరంజీవీ, సేతూ ఇద్దరూ నిర్విణ్ణులై నిలుచుండిపోయారు. చిరంజీవి శక్తికొద్దీ కాలితో తన్నిన బంతి, వరండాలో టిక్కుటిక్కుమని శబ్దంచేస్తూ ఆడుతున్న గోడగడియారం అద్దానికి తగిలి దాన్ని పగలగొట్టి పక్కగుమ్మంలో నుంచి ఎగిరి గదిలోపలికిపోయి అక్కడ గోడకు తగిలించివున్న నిలువుటద్దాన్ని క్రిందపడేసి మూలగావున్న కిరసనాయిలు సీసాను హరి కేన్ లాంతరునూ దొర్లించి మళ్ళీ వరండాలోకివచ్చి మెట్లుదాటి వేపచెట్టు క్రింద రాలివున్న ఎండుటాకులను గలగలలాడిస్తూ దొర్లిపోయి వేపచెట్టు మొదట్లో ఆగిపోయింది.

ఒక్క క్షణం గడిచాక వాళ్ళిద్దరికీ స్మృతివచ్చింది. ఇద్దరూ భయం భయంగా బిక్కచూపులు చూసుకున్నారు. తర్వాత ఇద్దరూ ఆ గదిలోపలికిపోయి జరిగిన ఘోరం అంతా చూశారు. కిరసనాయిలు ఆ

గదినిండా వ్యాపించింది. పెద్ద అద్దం నేలమీదపడి ముక్కలు ముక్కలై వుంది. హరికేన్ లాంతరు గ్లాసు 'పప్పు పప్పు'యిపోయింది. కిరసనాయిలు వాసన గుప్పుమని వ్యాపిస్తోంది. ఇద్దరు స్నేహితులూ ఏం చెయ్యాలో తెలియక బిక్కమొహాలు వేసుకుని ఒకచోట కూర్చున్నారు

జానకి ఏదోపనిమీద వరండాలోకివచ్చి దొంగల్లాగా కూర్చుని బిక్కచూపులు చూస్తున్న ఆ ఇద్దర్నీ చూసింది. ఆమెకు అనుమానం వేసింది. ఆమె గట్టిగా గాలిపీలుస్తూ 'ఏమిటీ ఈవాసన' అంటూ ఆ గది లోకిపోయి చూసింది. సేతు 'ఎందుకైనా మంచిద'ని లేచి పోబోయాడు. చిరంజీవి అతని చేతిని పట్టుకుని 'ఇలా నన్ను ఆపదలో నెట్టేసి నువ్వు నిశ్చింతగా వెళ్ళిపోతున్నావా?' అన్నట్టు జాలిగా చూశాడు. సేతు ఆగ లేదు. ఆమె వస్తే తనతో ఆడుతున్నందుకుకూడా చిరంజీవిని శిక్షిస్తుంది. అందువల్ల తను వెళ్ళిపోవటమే మంచిది. సేతు మరుక్షణంలో గోడదూకి తమ పంచలోకి వెళ్ళిపోయి కుర్చీలో కూర్చుని చూస్తున్నాడు.

ఆ గదిలో జరిగినదంతా చూసేసరికి ఆమెకు విపరీతమైన కోపం వచ్చింది. ఆమెకు ఎప్పుడూ ఏ వస్తువూ పాడుకావటం ఇష్టంలేదు. ఇప్పుడు పగిలిపోయిన అద్దం ఆమె పెళ్ళినాటిది. ఇప్పుడు పగిలిపోయిన హరికేన్ లాంతరు గ్లాసు రెండేళ్ళనాటిది. ఆమె, ఆ గదిలో జరిగిన ప్రళయం అంతా చూసి వరండాలోకి వచ్చేసరికి ఎదురుగా 'టిక్కు టిక్కు' మని ఆడుతున్న గడియారం అద్దం పగిలిపోయి దీనంగా కనుపించింది. ఆమె 'హవ్వ' అని నోరు నొక్కుకుంది. చిరంజీవి వంక 'ఇలాంటి రాక్షసుడివేం, నువ్వు?' అన్నట్టుగా చూసింది. ఆమె కళ్ళు కోపంతో ఎరుపెక్కినయ్. 'మీ నాన్నగార్ని రానియ్. ఇదంతా ఇలాగే వుంచి చూపిస్తాను. నీ ఆగడాలేమిటో ఆయనే కనుక్కుంటారు' అంటూ లోపలికి పోయింది.

చిరంజీవి అలాగే కూర్చునివున్నాడు. బంతి వేపచెట్టు మొదట్లో పడివుంది. వేపచెట్టుక్రింద ఎండిపోయిన ఆకులు రాలివున్నాయి. ఏదో పిట్ట విచిత్రంగాకూస్తూ హడావిడిగా ఎగిరిపోతోంది. వరండాలో

పిచ్చికలు రెండు కిచకిచలాడుతూ ఈ వ్యవహారాన్ని గురించే కాబోలు మాట్లాడుకుంటున్నాయి. ఎండ తీవ్రంగా కాస్తూనేవుంది. వరండాలో నుంచి కనబడుతున్న ఆకాశ భాగంలో మబ్బుతునకలు రెండు కదులుతున్నాయి. సేతు గోడదగ్గరికివచ్చి చిరంజీవిని నెమ్మదిగా పిలిచాడు. కాని చిరంజీవి పలకలేదు. కాస్సేపు ఎదురుచూసి సేతు మళ్ళీ ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

చిరంజీవికేమీ తోచలేదు. అతడు చాలా సేపు అలాగే కూర్చున్నాడు. అతని కిప్పుడంతా తలుచుకుంటే భయంగా వుంది. నాన్న అలిసిపోయి ఇంటికి వస్తాడు. అప్పుడీ విషయం విన్నాడంటే ఆయన కోపానికి హద్దుండదు. 'పుట్టగానే తల్లిని మింగిన రాక్షసు'డని ఆయన కసలే తనమీద కోపం. పిన్నికనక లేకపోతే ఈపాటికెప్పుడో తనను చంపివేసి వుండేవాడు. పిన్ని కూడా మంచిదే. కాని మంచితనం అతిగా చూపించి పిల్లవాణ్ణి చెడగొట్టటం ఆమె కిష్టంలేదు. అందువల్ల ఆమె ఈ విషయాన్ని భర్తకు చెప్పకుండా వుండదు.

గోడగడియారం నాలుగు గంటలు కొట్టింది. చిరంజీవి దానికేసి చూశాడు. దాని అద్దం ఏడెనిమిది ముక్కలుగా పగిలిపోయింది. దాన్నిలా ఎవరైనాచూస్తే అసహ్యంగానే వుంటుంది. అది చాలా పాత గడియారం తన తాతగారు బాగా బ్రతికిన రోజులనాటిది. అది ఆ కారణంగా ఆ ఇంట్లో చాలా ప్రాముఖ్యాన్ని గడించుకుంది. తమ ఇంటికి ఎవరైనావస్తే వారు వింతగా చూపించేవాటిలో ఇదొకటి. ఒక వందయేళ్ళనాటి రోలూ, అరవై ఏళ్ళనాటి తిరగలీ, నలభై ఏళ్ళనాటి పెద్దపీటా దాదాపు నలభై ఏళ్ళనాటి ఈ గోడగడియారమూ-వీటిని చూపించి పాతకాలపు వస్తువులెంత మన్నికగలవో, ఎంత నిజాయితీగా పనిచేస్తాయో వివరిస్తారు. 'ఇన్నేళ్ళనుంచి విశ్వాసంతో పనిచేస్తున్నందుకు ఈనాటికి నీవు మంచి ప్రతిఫలమే చూపించావు' అని కోపం తెచ్చుకున్నట్టు ఆ గడియారం శబ్దంచేస్తూ ఆడుతోంది.

జానకి మొహం కడుక్కుని ముందు గదిలోకి వచ్చి చిన్న

అద్దంలో మొహం చూసుకుంటూ పౌడరు స్నో రాచుకోబోయింది. అవి రెండూ నిండుకున్నాయి. ఆమె 'అయ్యో! నిన్ననే తెమ్మని చెబుదామనుకున్నాను. నా మతి మండిపోను! గుర్తేలేదు!' అని విసుక్కోవటం చిరంజీవికి వినిపించింది.

తర్వాత ఆమె చిరంజీవిని వంటయింట్లోనుంచి పిలిచింది. బహుశా కాఫీ తాగేందుకు కావచ్చు. చిరంజీవి లేచి ముక్కు తుడుచుకున్నాడు. లాగూ పైకిలాక్కున్నాడు. వంటయింట్లోకి పోదామనుకున్నాడు. కాని అతడలా చెయ్యలేదు. వరండా మెట్లుదిగి వేపచెట్టు నీడలో నడిచిపోయి సింహద్వారందాటి వీధిలోకి వచ్చాడు.

వీధిలో ఎండ మాడ్చివేస్తున్నది. నాలుగు గంటలయినా సూర్యుడు నిప్పులు చెరుగుతూనే వున్నాడు. టెలిగ్రాఫ్ తీగలమధ్య రెండు గాలిపటాలు చిక్కుకుని వున్నాయి. ఆ వీధి చివర చెట్టు కింద ఒకడు, ఒక కుర్రవాడి సాయంతో గిన్నెలకు కళాయి వేస్తున్నాడు. ఆ కుర్రవాడు మోకాళ్ళమీద కూర్చుని తోలుతిత్తిని వొత్తుతున్నాడు. కొలిమి 'గుఫ్ గుఫ్'మని మండుతోంది. కొద్ది దూరంలో ఒక అరవైఏళ్ళ ముదుసలి నీడలో కూర్చుని మొక్కజొన్న పొత్తులు కాల్చి అమ్ముతోంది. ఇద్దరు పిల్లలు చెరొకటి బేరంచేసి కొనుక్కుంటున్నారు. ఒక ఇంటి పంచలో దూదేకులవాడొకడు దూదిఏకుతున్నాడు. చిరంజీవి ఆ ఇంటిముందు చాలా సేపు నిలబడి అదంతా చూశాడు. ఒకడొక బుట్ట భుజాన పెట్టుకుని 'పాతపేపర్లు కొంటాం, పాత పుస్తకాలు కొంటాం' అని అరుస్తూ పోతున్నాడు. ఇక ఇంటి పంచలో, చిరంజీవి యీడుదే ఒకపిల్ల బెలూను వూది తనకంటే చిన్నవాడైన తమ్ముణ్ని ఆడించబోయింది. ఆ పిల్ల బెలూనువూది బైటికి తియ్యగానే అది 'ఠప్'మని పగిలిపోయింది. ఆ చిన్నపిల్లవాడు 'కెవ్వు'మని ఏడవటం ప్రారంభించాడు. ఆ అమ్మాయి బెలూను పగులగొట్టినందుకూ, తమ్ముణ్ని సముదాయించమంటే ఏడిపించినందుకూ తల్లి ఏం శిక్ష వేస్తుందోనని హడిలిపోతూ బిక్కమొహంపెట్టి 'తమ్ములూ వూలుకో!' అంటున్నది. మరికొంత దూరంలో ఒక ఇంటిపంచలో పదిపదిహేను మంది ఆడవాళ్ళు కూర్చుని కబుర్లు

చెప్పుకుంటున్నారు. ఆ ఇంటి సింహద్వారంమీద మాత్రం 'కుక్కలున్నవి జాగ్రత్త' అని వ్రాసివుంది. చిరంజీవి ఆ వాక్యం కూడ బలుక్కుంటూ చదివాడు. అతని కక్కడ కుక్కలు కనిపించనేలేదు.

ఇన్ని చూస్తూ నడుస్తున్నా చిరంజీవి మనస్సు వికలమై వుంది. అతనికి నాన్న ఇంటికిరాగానే జరుగబోయే తతంగం తలుచుకుంటే వొణుకు పుట్టుకొస్తున్నది.

చిరంజీవి పెద్దబజారులోకి వచ్చాడు. నాన్నగారి ఆఫీసు ఇంక ఎంతో దూరంలేదు. ఆ ఆఫీసు అతనికి బాగా తెలుసు. చిరంజీవి కాళ్ళు కాలుతున్నాయి. అయినా అతడు లెక్క చెయ్యటంలేదు. అతని మనస్సంతా ఒకటి రెండు గంటలలో తనకుపడే శిక్షమీదేవుంది. నాన్న తనను పేము బెత్తంతో కొడతాడు. పిన్నికూడా ఈసారి అడ్డంరాదేమో!

గంట అయిదయినట్టుంది. చిరంజీవి వాళ్ళ నాన్నగారి ఆఫీసు ముందు నిలబడ్డాడు. అక్కడ చాలామంది హడావిడిగా ఏదో వ్రాసుకుంటూ, చేతిలో కాయితాలతో అటూ ఇటూ తిరుగుతున్నారు. చిరంజీవి నెమ్మదిగా లోపలికి నడిచాడు. అక్కడ టేబుళ్ళమీద వెనక వున్న మనుషులుకూడా కనుపించనన్ని కాగితాలువున్నాయి. చిరంజీవి అక్కడ ఒక బల్లవుంటే దానిమీద కూర్చున్నాడు. లోపల ఏవేవో కాయితాలు కదులుతున్న చప్పుడూ, కొద్దికొద్దిగా మాటలూ వినిపిస్తున్నాయి.

ఇంతలో అతన్ని శేఖరంగారు పలకరించారు. ఆయన ఇల్లుకూడా తమ వీధిలోనే. ఆయన కూతురు రుక్మిణి తన బడిలోనే చదువుకుంటున్నది. ఆయన కళ్ళజోడు సవరించుకుంటూ 'ఏమిరా ఇలా వొచ్చావు? మీ నాన్నగారికోసమా? అంటూ గుమ్మంలోకి వెళ్ళి! "ఏమోయ్ సారథీ! మీ సుపుత్రు డెందుకో వేంచేశాడు" అంటూ చిరంజీవిని లోపలికి పంపించాడు.

నాన్నగారి ముందున్న బల్లమీద అటూ ఇటూ పెద్ద పెద్ద

దొంతర్లుగా కాయితాలు వున్నాయి. ఆ రెండుదొంతర్ల మధ్యనుంచి నాన్నగారి ముఖం కనుపిస్తోంది. ఆ బల్ల చివర చిరంజీవి గడ్డానికి ఆనుతోంది. ఆయన చిరంజీవిని చూసి "ఏమిటిరా' అని అడిగాడు. చిరంజీవికి ఆయన కోపంగా వున్నట్టు కనిపించాడు. నిజానికది అలసట తప్ప మరేమీ కాదు. ఆయన నుదుటిమీద అక్కడక్కడ స్వేదబిందువు లున్నాయి. చిరంజీవి సమాధానం చెప్పకపోయేసరికి ఆయన 'ఏమిరా, మొద్దూ ! అలా మొద్దులా నుంచున్నావేం?' అని కసిరాడు. చిరంజీవి ఏదో చెప్పాలనుకున్నాడు. కాని ఏం చెప్పాలో తోచలేదు. చివరకు "నాన్నా ! పిన్ని, స్నో పౌడరూ అయిపోయాయిట, తెమ్మన్నది" అన్నాడు. సారధి ఉలిక్కిపడి "నోరుమూసుకో వెధవా !" అన్నాడు. తర్వాత వాడు అన్నమాట ఎవరైనా విన్నారేమోనని చుట్టూచూశాడు. కాని అదృష్టవశాత్తూ ఎవరి పనుల్లో వారు కంఠదఘ్నంగా మునిగి వున్నారు. సారధి గుండెలనిండా గాలి పీల్చుకుని మళ్లీ కాయితం మీద ఏదో వ్రాయటం ప్రారంభించాడు. చిరంజీవి ఆ బల్లపక్కనే కూర్చున్నాడు.

పదినిమిషాలు గడిచేసరికి ఆయన పనిపూర్తిచేసుకొని కాయితా లన్నింటిని ఎక్కడివక్కడ సర్దేసి చిరంజీవితో "లే, పోదాం" అంటూ వుండగా బుర్రమీసాల వాడొకడు అక్కడికి వచ్చి 'మిమ్మల్ని ఆఫీసరు గారు రమ్మంటున్నారండి' అన్నాడు.

ఆ బుర్రమీసాలవాడి మెడలో ఏదో బిళ్ళవుంది. వాడి నెత్తిన టోపీ వుంది.

సారధి చిరంజీవి నక్కడేవదిలి, త్వరత్వరగా ఆఫీసరుగారి గదిలోకి వెళ్ళాడు. ఆఫీసరు సారధిని కూర్చోమని చెప్పి "కంగ్రాచ్యు లేషన్స్, మిష్టర్ సారధీ ! ఇవాళే కంపెనీనుంచి మిమ్మల్ని ప్రమోట్ చేస్తూ ఆర్డర్లువచ్చాయి. పని తొందరలో ఉండటంవల్ల ఉదయంనుండి చెప్పడానికి వీలుపడలేదు" అంటూ ఆ కాగితాలు ఆయనకు అందించాడు. సారధి పొంగిపోయాడు. ఆయన ఎన్నాళ్ళనుంచో ప్రమోషన్‌కోసం

కాచుకుని వున్నాడు. ఆయన ఆనందం పట్టలేక ఆఫీసరుతో కరచాలనం చేసి ఇదంతా మీ చలవ అన్నాడు. ఆఫీసరు నవ్వుతూ మరి "మాకు ఏ డిన్నరో ఏర్పాటు చేయించండి" అన్నాడు. సారథి 'అలాగే' అంటూ ఇవతలికి వచ్చాడు, అప్పుడే అందరూ ఆయన్ను చుట్టేసి ఆ ఆర్డరు కాయితాలు చూస్తున్నారు. చిరంజీవికి ఆ గుంపులో వాళ్ళనాన్న కనుపించనేలేదు. వాడికి ఆదుర్దా ఎక్కువై 'నాన్నా' అని పెద్దగా కేక వేశాడు. సారథి ఇవతలికివచ్చి వాణ్ణి దగ్గరకితీసుకున్నాడు. తర్వాత ఆయన అప్పటికప్పుడే అందర్నీ టీపార్టీకి ఆహ్వానించాడు. ఆఫీసరు గారిని పిలిస్తే ఆయన "క్షమించు సారథీ! నే నీపూట వూరికి వెళ్ళాలి. ఇంటికిపోయి ఎన్నో సర్దుకోవాలి. మరేమనుకోకు" అన్నాడు.

అందరూ తమతమ కాయితాలన్నీ సర్దేసి తయారైనారు. చిరంజీవికి ఈ హడావిడి అంతా ఏమిటో అర్థంకాలేదు. అతడు వాళ్ళ నాన్న చెయ్యిమాత్రం వదిలిపెట్టలేదు. వాళ్ళలో చాలామంది చిరంజీవిని చూసి "మీవాడేనా?" అని అడిగి 'ఔన'నిపించుకుని వాడిబుగ్గలు నొక్కి నొక్కి వదిలిపెడుతున్నారు. శేఖరం వాణ్ణి ఎత్తుకుని 'అసలీవాళ వీడు రాబట్టే ఇది జరిగింది. ఇంటిదగ్గర వీణ్ని ఎప్పుడూ కొట్టి చంపుతూ వుంటాడండి దుర్మార్గుడు' అన్నాడు సారథి నుద్దేశించి. సారథి మళ్ళీ చిరంజీవిని దగ్గరికి తీసుకుంటూ 'వూరికే ఎందుకు కొడతానురా శేఖర్! ఎప్పుడూ ఏవో అల్లరిపనులు చేసి వాళ్ళ పిన్నిని ఏడిపిస్తూ దెబ్బలుతింటూ వుంటాడు' అన్నాడు.

అందరూ ఏదో హోటల్లోకి వెళ్ళారు. అక్కడ చల్లగావుంది. అందరూ ఒకరూములో కూర్చుని ఏవేవో ఫలహారాలు తెప్పించుకుని తిన్నారు. చిరంజీవికి బల్లమీద వున్న జిలేబీ అందలేదు. అతడు లేచి నిలబడి వాళ్ళవంక చూస్తూ ఆ జిలేబీ తిన్నాడు. అది తినేసరికి అతనికి మొహం మొత్తింది. అందరూ మరి కొద్దిసేపట్లో బయటకువచ్చి సారథికి 'గుడ్‌బై' చెప్పి ఎవరిదోవన వారు వెళ్ళిపోయారు. సారథీ, చిరంజీవీ, శేఖరంగారూ ముగ్గురూ నెమ్మదిగా నడవటం ప్రారంభించారు. కొద్దిదూరం వెళ్ళినతర్వాత చిరంజీవి "నాన్నా! స్నో పౌడరు..."

అన్నాడు. సారథి నవ్వి ఒక కొట్లోకివెళ్ళి స్నో సీసా ఒకటి, పౌడరు డబ్బా ఒకటి కొన్నాడు.

ఇంటికి వెళ్లేసరికి చిరంజీవికి మళ్ళీ భయంపట్టుకుంది. వాడు నాన్నగారి చేతుల్లోనుంచి స్నో సీసా పౌడరుడబ్బా తీసుకుని ఒక్క అంగలో యింట్లోకి వెళ్ళాడు. వాళ్ళ నాన్న శేఖరంగారితో మాట్లాడుతూ వాకిట్లోనే నిలబడ్డాడు.

చిరంజీవి ముందుగదిలోకి తొంగిచూశాడు. ఆ గది శుభ్రంగా కడిగివుంది. ఎక్కడా కిరసనాయిలు వాసనకూడా లేదు. అతడు వంట ఇంట్లోకి వెళ్ళి 'పిన్నీ పిన్నీ' అని పిలిచాడు. గుమ్మంలో నిలబడి తల్లో పూలు పెట్టుకుంటున్న జానకి అతన్ని చూసి కోపంతో "కాఫీనీళ్ళయినా తాగకుండా ఎక్కడికి పోయినావో చెప్పు ముందు" అని గదమా యించింది. చిరంజీవి వెనక దాచిపెట్టిన స్నో పౌడరూ బయటికి తీశాడు. ఆమె ఆశ్చర్యపోయి 'ఇవెక్కడివీ?' అని అడిగింది. 'నాన్నగారు' అన్నాడు చిరంజీవి.

ఇంతలో వాళ్ళ నాన్న 'హల్లో జానీ!' అంటూ రానే వచ్చాడు.

జానకి మొహం ముడుచుకుని "ఛీ! జానీ ఏమిటి? పెంపుడు కుక్కలను పిలిచినట్టు!" అన్నది. సారథి కూర్చుంటూ "అయితే స్నోలూ పౌడర్లకోసం ఆఫీసుకు కబుర్లుపెట్టడం ఎక్కడ నేర్చావు?" అని అడిగాడు. జానకి ఆశ్చర్యపోయింది.

చిరంజీవి నెమ్మదిగా వాకిట్లోకి వెళ్ళాడు. గోడ మీదుగా నేతు ముఖం కనుపించింది. వారిద్దరూ నిశ్శబ్దంగా ఒకరినొకరు చూసుకున్నారు. ఒక్క నిముషం గడిచేసరికి వంటయింట్లోనుంచి కేక వినిపించింది. చిరంజీవి నెమ్మది నెమ్మదిగా నడిచి లోపలికివెళ్లాడు.

సారథి వాణ్ణి దగ్గరికి తీసుకొని వొళ్ళో కూర్చోబెట్టుకుని గడియారం అద్దం పగలగొట్టావా? అలా వస్తువులను పాడుచేసు కుంటారా ఎవరైనా? తప్పుకదూ. రేపు దానికి మరో అద్దం వేయించి

బాగుచేయిస్తాన్లే! అన్నట్టు యిందాక ఎండలో నడిచివొచ్చావు కదా కాళ్ళు కాలలేదూ? రేపు బజారుకుపోయి నీకు చెప్పులు కొంటానులే. నువ్వు కాఫీ తాగలేదని పిన్ని చెప్పిందే! ఇదిగో తాగు." అన్నాడు. చిరంజీవి 'అమ్మయ్య' అనుకున్నాడు. పిన్నిమాత్రం 'ఏదైనా అతి పనికిరాదు" అన్నది. తండ్రి నవ్వాడు. చిరంజీవి కూడా నవ్వాడు. అప్పుడే యింట్లోకి వచ్చిన సేతుకూడా నవ్వాడు.

(29.6.60 — ఆంధ్ర సచిత్ర వారపత్రిక)